


*(గత సంచిక తరువాయి)*

***రచనాకాలం: 2000 సంవత్సరం***

4

**విరించి ఉదయమే** కంప్యూటర్ క్లాస్‌కి హాజరయ్యాడు. అమెరికాకి వెళ్ళాలనుకునే చాలామందిలా అతనూ జావా నేర్చుకుంటున్నాడు. తన క్లాసయ్యాక బయటికి వచ్చి నిలబడ్డాడు. పావుగంట తర్వాత లోపలనుంచి వచ్చిందో పంతొమ్మిదేళ్ళమ్మాయి.

"హాయ్ వి" విష్ చేసింది.

"హలో మా" బదులుగా ఉత్సాహంగా పలకరించాడు విరించి.

ఆమె పేరు మానసి. పరిచయమైన కొత్తల్లో మానసి అనేవాడు కానీ ఇద్దరిమధ్య పరిచయం ప్రణయానికి దారితీసాక విరించి మానసిలోని మొదటి అక్షరంతో, అలాగే మానసి కూడా అతని మొదటి అక్షరంతో సంభోదించుకుంటున్నారు.

"క్లాసయ్యిందా?" అడిగాడు విరించి.

తలూపి అడిగింది మానసి.

"నాలుగురోజులు డుమ్మా కొట్టావేమిటి?"

"అమెరికా నించి మా అన్నయ్య వస్తేనూ"

"ఓ! చెప్పావుగా."

"నీతో మాట్లాడాలి"

"మాట్లాడుతూనే వున్నావుగా" నవ్వింది.

"సీరియస్ మేటర్."

"ఏం? ఇంకో గర్ల్‌ఫ్రెండ్ దొరికిందా? అయినా నాకదంత సీరియస్ మేటర్ కాదులే."

"డోంట్ బి సిల్లీ. త్వరలో నన్ను అమెరికా పంపిస్తున్నాడు మా అన్నయ్య. ఆ విషయం మాట్లాడాలి."

వెంటనే కొద్దిగా విషాదం తొంగి చూసింది మానసి మొహంలో.

"కంగ్రాట్స్. మీ అన్నయ్య స్పాన్సర్ చేస్తున్నారా?"

"అవును. మరి నీ విషయం ఏమిటి?"

"నువ్వు హెచ్ వన్ వీసాతోనేగా వెళ్ళేది? వచ్చి నన్ను పెళ్ళిచేసుకుని డిపెండెంట్ వీసా మీద తీసుకెళ్ళు" నవ్వుతూ చెప్పింది మానసి.

"నేను వెళితే చాలా ఏళ్ళదాకా ఇండియాకి తిరిగిరాను"

"ఎన్నేళ్ళు పట్టవచ్చు?"

"చాలా. నువ్వు కూడా సీరియస్‌గా అమెరికాకి వచ్చే ప్రయత్నం ప్రారంభించాలి. స్టూడెంట్ వీసాకి ట్రై చెయ్యి."

"ఇక్కడ మెట్లమీద నుంచొనేనా ఇవన్నీ?"

"అందుకే ఇందాకే చెప్పానా? నీతో సీరియస్ మేటర్ మాట్లాడాలని. పద."

ఇద్దరూ దగ్గరే వున్న ఓ ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్‌కి దారితీశారు. విరించి ఓ ఫౌంటెన్ కోక్‌ని కొన్నాడు. ఓ ఖాళీ డిస్పోజబుల్ గ్లాసు అడిగి తీసుకున్నాడు.

మానసి దాన్ని చెరిసగం పంచింది. ఇద్దరూ ఓ టేబుల్ ముందు కూర్చున్నారు.

"ఎప్పుడు నువ్వు అమెరికా బయలుదేరేది?" అడిగింది మానసి కోక్‌ని కొద్దిగా టేస్ట్ చేసి.

"త్వరలో."

"ఎంత త్వరలో?"

కొద్దిగా సందేహించి చెప్పాడు.

"నువ్వు రహస్యాలని నీలో దాచుకోగలవా?"

"మా ఎదురింటాయనకి వాళ్ళ ఆఫీస్ స్టెనోకి సంబంధం వుందని, వాళ్ళావిడ పుట్టింటికి వెళ్ళినప్పుడల్లా వాళ్ళింటికి వస్తుంటుందని నీతో ఎప్పుడైనా చెప్పానా? పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే మా ఇంటాయనకి ఆరు అపార్ట్‌మెంటులు, ఓ ద్రాక్షతోట వున్నాయని ఎప్పుడైనా చెప్పానా? మా పిన్ని భర్తకి తెలియకుండా చిట్టీలు కడుతుంటుందని ఎప్పుడైనా చెప్పానా? మా.."

"ఆగాగు. సరే! నువ్వు రహస్యాన్ని కాపాడగలవు అని వప్పుకొన్నా."

"అలా అనేం కాదు. ఎందుకు చెప్పలేదంటే మనిద్దరి గురించి మాట్లాడుకునే విషయాలు మిగిలి వున్నాయి. కాబట్టి అవయ్యాక ఇవి చెబుదామనుకున్నాను" నవ్వింది.

"నేను చెప్పేది నీ మనసులోనే వుంచుకో. నేను అమెరికా వెళ్ళేది ఇల్లీగల్ మెథడ్‌లో. తర్వాత అది పూర్తిగా లీగల్ అయితే కానీ ఇండియాకి రాలేను. అందుకు అయిదారేళ్ళపైనే పట్టచ్చు."

"ఏమిటా ఇల్లీగల్ మెథడ్? నేనూ జాయనౌతాను" నవ్వింది మళ్ళీ.

"పూర్తిగా నాకూ తెలియదు. మా అన్నయ్య ప్లానింగ్ అదంతా. నిజానికి ఇల్లీగల్‌గా వుండిన మా అన్నయ్యని అమెరికానుంచి డిపోర్ట్ చేసేశారు."

"అరెరె!"

"కాబట్టి కొద్దికాలం మన మధ్య దూరం తప్పదు."

"కొద్దికాలం అంటే ఎన్నేళ్ళో?" అడిగింది.

"నిజంగా నాకు తెలీదు. మా అన్నయ్య ఏ విషయం అవసరమైతే అప్పుడే చెపుతున్నాడు. మొత్తం ఒక్కసారి చెప్పడట."

"టూ బేడ్ మీ శ్రీకర్ ఎలా వున్నాడు?"

విరించి జేబులోంచి ఓ తాళం చెవిని తీసి చూపించి చెప్పాడు.

"లేడు. కేంప్‌కెళ్ళాడు. రాత్రి వెళుతూ తాళం చెవిని యిచ్చేశాడు."

"నో అని ఇదివరకే చెప్పానుగా. ఎందుకు తీసుకున్నావది?" కోపంగా అడిగింది.

"ఉండనీ అని."

"వద్దని చెప్పాగా? మనిద్దరం అతని గదికి వెళ్ళామని అనుకోవచ్చుగా శ్రీకర్?" చిరుకోపంగా చెప్పింది మానసి.

"నువ్వు రాలేదని చెప్తాలే. అదీకాక నేను మొత్తం ఏం అడగడం లేదుగా. జస్ట్ ఏ ఫ్యూ కిసెస్."

"ఫ్యూ కిసెస్ అంటే మాటలా?"

"యస్. హియర్ అండ్ దేర్" నవ్వుతూ చెపాడు.

ఆమెలో కోపం తగ్గలేదు.

"వప్పుకోవోయ్. నువ్వు నా గర్ల్ ఫ్రెండ్‌వి కానీ పరాయిదానివి కాదుగా. వప్పుకోకపోవడానికి."

"కిసెస్ కోసం ఇంకో గర్ల్‌ఫ్రెండ్‌ని వెతుక్కోమని నీకేనాడో పర్మిషన్ ఇచ్చాగా?"

"ఇచ్చావు కానీ నీ ఫేస్ కట్‌గల అమ్మాయి దొరికి చావడం లేదుగా. ప్లీజ్."

"నో కిసెస్ బిఫోర్ మేరేజ్"

"నైన్‌టీన్ సెవంటీన్‌లో వున్నావింకా. ట్వంటీ ఫస్ట్ సెంచరీలోకి రావాలి."

"ఉహూ! రాను."

"జేబులో తాళం చెవితో నిన్ను కలిసినప్పుడల్లా ఈరోజైనా నేను లక్కీనా అనుకుంటూంటాను."

"కాని నువ్వు లక్కీవో కాదో నాకు ముందే తెలుసు. ఈరోజు నువ్వు లక్కీ కాదు."

చేతి గడియారం వంక చూసుకుని హేండ్‌బేగ్ తెరిచి ఓ కవర్ తీసిచ్చి చెప్పింది.

"తర్వాత చదువు. వెళదాం ఇక."

విరించి ఆ కవర్ జేబులో పెట్టుకున్నాడు. వాళ్ళ వయస్సుగల జంటలు అనేకమంది ఆ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో వున్నారు. ఎవరి ప్రపంచం వాళ్ళది. ఇతరులని పట్టించుకోవడంలేదు వాళ్ళు. బస్‌స్టాప్‌కి చేరుకున్నారిద్దరూ.

"మనలాంటి ఓ అమ్మాయి, అబ్బాయి పార్క్‌కి వెళ్ళారట. ఇద్దరూ ఒక మూలకి వెళ్ళారు. అబ్బాయి 'నిన్ను ముద్దుపెట్టుకోనా' అని అడిగితే వెంటనే ఆ అమ్మాయి 'రక్షించండి. నన్ను ఇతన్నించి రక్షించండి' అని గట్టిగా అరిచిందట. ఎందుకో తెలుసా?" అడిగాడు.

"మనలాంటి ఒక అమ్మాయి అబ్బాయి అన్నావుగా ఇందాక. నాకు తెలిసీ బలవంతంగా ముద్దుపెట్టుకునే ధైర్యం నీకు లేదు. అతనికుందని అమ్మాయి అనుకుని వుండచ్చు. అందుకని ప్రికాషనరీ మెషర్‌గా అరిచి వుంటుంది" చెప్పింది మానసి.

"ప్రికాషనరీ మెషరే కానీ నువ్వనుకున్న కారణానికి కాదు. అలా అరిచినా ఎవరూ రాలేదట. దాంతో ఎవరూ రాలేదంటే మన మాటలు వినబడేంత దూరంలో ఎవరూ లేరు. నువ్వు ఇక కానియ్ అన్నదిట. అలా వుండాలి అమ్మాయంటే."

"నేనూ వున్నానెందుకు?" సన్నగా నవ్వింది మానసి.

మానసి బస్ రాగానే అతనికి బై చెప్పి ఎక్కింది. బస్ వెళ్ళాక చిన్నగా నిట్టూర్చి జేబులోంచి మానసి ఇచ్చిన కవర్ తీసాడు. ఆ కవర్ మీద ప్రేమ సింబల్ స్కెచ్‌పెన్‌తో గీసి వుంది. దాన్ని చింపి ఒక కాగితాన్ని బయటకి తీశాడు.

మధ్యకి మడిచి వున్న ఆ దళసరి కాగితం మీద అందంగా రాసి వుంది.

*ముద్దులు గతా తీసుకున్న అబ్బాయి తర్వాత దూరమైతే అవివాహిత మనసెలా వుంటుందో లోపల చూస్తే తెలుస్తుంది.*

మడిచిన ఆ కాగితాన్ని విప్పాడు. మడత కింద కాగితం మీద హృదయం ఆకారం గీసిన భాగంలో పది గుండుసూదులు గుచ్చి వున్నాయి.

## 5

గోపీనాథ్ దినపత్రికలన్నీ తీసుకుని తిరగేయసాగాడు. అతను ఏదో వార్తకోసం వెదుకుతున్నట్లుగా ప్రతి దినపత్రికనీ దీక్షగా చదవసాగాడు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య, అపార్ట్‌మెంట్ మీంచి జారిపడ్డ పెయింటర్ మృతి, హుస్సేన్‌సాగర్‌లో గుర్తుతెలియని శవం, నగర శివార్లలో నాలుగిళ్ళపై దోపిడి, లాంటి వార్తల హెడ్డింగ్స్ చదివి వదిలేశాడు.

'సివిల్ కేసులో పోలీసులు' అన్న హెడ్డింగ్ కింద మేటర్‌ని ఆసక్తిగా చదివాడు.

నాగార్జున సాగర్ రోడ్డు పోలీస్ స్టేషన్ పరిధిలో భూవివాదంలో స్థానిక సి.ఐ జంగమయ్య తలదూర్చుతున్నాడని అనేకులు ఆరోపిస్తున్నారని. భూవివాదంలో ఎవరు ఎక్కువ అతనికి ముట్టచెపితే వాళ్ళకి లాభం జరిగేలా పరిష్కరిస్తానన్నాడని, కాదంటే రెండు పార్టీల మీద అక్రమ కేసులు బనాయిస్తున్నాడని ఈ విషయం మీద సి.ఐ మీద ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు కల్పించుకోకపోవటంతో వీళ్ళకి ఇందులో భాగస్వామ్యం ఉండవచ్చని అనుకోవాల్సివస్తోందని ఇందుకు తాజా ఉదాహరణగా నాగార్జున సాగర్ రోడ్డులోని ఓ ఖాళీ నివేశన స్థలం విషయంలో అన్నదమ్ములైన యాదయ్య, శీనయ్యల వివాదంలో సి.ఐ జోక్యం చేసుకుని యాదయ్యకి ఆ స్థలం యిప్పించటమే కాక, శీనయ్యని స్టేషన్‌కి పిలిపించి కొట్టి అతని చేత కొన్ని డాక్యుమెంట్ల మీద బలవంతంగా సంతకాలు చేయించుకున్నాడని శీనయ్య పత్రికా ప్రతినిధికి చెప్పాడన్న వార్త వుంది. అతని వీపు మీద గాయాల ఫోటోని కూడా ప్రచురించారు. అక్రమ అరెస్టు, అక్రమ నిర్బంధం మీద డి.సి.పికి శీనయ్య ఫిర్యాదు చేసాడని వుంది. వివరణకై సి.ఐ కోసం ప్రయత్నిస్తే అతను దొరకలేదని కూడా రాశారు.

తారీకు చూశాడు. అది నెలక్రితం దినపత్రిక. దాన్ని పక్కనపెట్టి ఆ తర్వాతి దినపత్రికలన్నీ కూడా చూశాడు.

ఎక్కడా ఆ వివాదం గురించి కానీ, ఆ సి.ఐ మీద ఎలాంటి చర్య తీసుకున్నారు అన్న వివరం మీద కాని ఎలాంటి వార్తాలేదు.

నాగార్జున సాగర్ రోడ్డు పరిధిలోని పోలీస్ స్టేషన్ నెంబర్ చూసి డైల్ చేశాడు. అవతల రిసీవర్ ఎత్తాక సి.ఐ జంగమయ్యతో మాట్లాడాలని చెప్పాడు.

''జంగమయ్యనే. మీరెవరు? ఎక్కడనించి?'' వినిపించిందో కంఠం.

''నా పేరు గోపీనాథ్ మాసాబ్ బేంక్ నుంచి. మీతో చిన్నపని పడింది సార్'' చెప్పాడు గోపీనాథ్

''ఏం పని?''

''మీ సహాయం కావాలి. మీతో స్వయంగా వచ్చి మాట్లాడతాను సార్.''

''ఏం సహాయమో చెప్పు ముందు.''

''పర్సనల్‌గా చెప్తాను సార్.''

రిసీవర్ పెట్టేశారు అవతలివైపు.

గోపీనాథ్ కూడా లైన్ డిస్కనెక్ట్ చేశాడు.

నైట్ పోస్టాఫీస్‌కి వెళ్ళి తన అడ్రస్‌కి తన పేర ఏభై రూపాయలు యం.ఓ చేశాడు. ఫ్రం అడ్రసు స్థానంలో చేతికి వచ్చిన అడ్రస్ రాశాడు.

మర్నాడు పోస్ట్‌మేన్ వచ్చే టైంకి ఇంట్లోనే వున్నాడు గోపీనాథ్. అతనిచ్చిన యం.వో ఫారం మీద సంతకం చేస్తూ అడిగాడు.

"నువ్వు నాకో హెల్ప్ చేయగలవా?"

"ఏం చేయాలి సార్?" అడిగాడు పోస్ట్‌మేన్.

"నెల్రకితం డేట్‌తో పోస్ట్ అయినట్లుగా రెండు కవర్లు కావాలి."

"దేనికి సర్?"

"ఓ చిట్ ఫండ్ వ్యవహారంలో అవసరమయ్యాయి."

ముందే సిద్ధంగా వుంచుకున్న రెండు పోస్టల్ కవర్లని యిచ్చాడు. వాటి మీద విరించి చిరునామా వుంది. ఒక దానిమీద రిజిష్టర్ పోస్ట్‌కి సరిపడే పోస్టేజి అతికించి వుంది. పోస్టాఫీసులో బుక్ చేసినట్టుగా ఆర్.పి.ఎల్ అని ఎర్ర ఇంకుతో రాసి ఎదురుగా ఓ నంబర్, దానికింద తేదీ వేసి వుంది.

"ఆ పని చేసిపెట్టడానికి.." గొణిగాడు పోస్ట్‌మేన్.

అతనిచ్చిన ఏభై రూపాయల నోటు తీసుకోకపోతే ఇంకో వందరూపాయల నోటిచ్చి చెప్పాడు గోపీనాథ్.

"పని పూర్తిచేస్తే ఇంకో రెండు వందలిస్తాను. నీవు తలచుకుంటే చెయ్యగలవు. చెయ్యలేనంటే నేను నమ్మను."

"ఇంకొకరికి కూడా ఇవ్వాల్సి వుంటుంది సార్."

"ఎంత?" అడిగాడు గోపీనాథ్.

"వందో, నూట ఏభయ్యో! ఎంతో కొంత తడిపేది."

"సర్లే. పని పూర్తిచేసి మొత్తం ఒకేసారి తీసుకో."

## 6

ఆ ఉదయం నిజామాబాద్ నించి గోపీనాథ్ పెద్దత్త అనసూయ వచ్చింది. ఆవిడని చూసి అంతా సంతోషించారు. ఒక్క గోపీనాథ్ తండ్రి అరుణాచలం తప్ప.

"ఏమిటే, ఫోన్ చేయకుండా వచ్చావ్?" అడిగాడు అక్కని ముభావంగా.

"వద్దామనుకున్నాక మళ్ళీ ఫోనెందుకు అని చేయలేదు. గోపీ అమెరికా నించి తిరిగి వచ్చాడని తెలీగానే చూడాలనిపించి వచ్చాను."

అనసూయ వయసు అరవైరెండు. భర్తపోయి చాలాకాలమైంది. ఇద్దరబ్బాయిలకీ పెళ్ళిళ్ళయ్యాయి. కోడళ్ళకి, ఆవిడకి సయోధ్య లేదు.

దాంతో ఆవిడ వాళ్ళ ఇళ్ళు ఎవాయిడ్ చేసి బంధువుల ఇళ్ళల్లో గడుపుతుంటుంది. ఎవరింట్లో అనసూయ ఎక్కువరోజులున్నా, ఆవిడ కొడుకులిద్దరికీ వాళ్ళమీద అనుమానం, తమ భార్యల గురించి తల్లి చెడ్డగా చెప్పేదంతా నమ్మేస్తారని, ఆ కారణంగా గోపీనాథ్ తండ్రికి అనసూయ తమింటికి రావడం ఇష్టముండదు.

అయితే ఆవిడ ఏ ఇంటికి వెళ్ళినా ఆ ఇంటి పిల్లలు సంతోషపడతారు. ఆవిడ వంట బావుంటుంది. ఎవరికి ఏం ఇష్టమో కూడా ఆవిడకి గుర్తే. వాళ్ళకది రుచిగా వండి పెడుతుంటుంది. పిల్లలతో పిల్లల్లా కలిసిపోతుంది. వాళ్ళతో పేకాట, అష్టాచమ్మాలాంటివి ఆడుతుంది. టి.వి సీరియల్స్ మిస్ అయితే జరిగిన కథ చెప్తుంది.

ఆవిడకి నలుగురు కూతుళ్ళు కూడా వున్నారు. కానీ కూతుర్ల ఇళ్ళకి వెళ్ళి వుంటే అల్లుళ్ళ దగ్గర చులకన అవుతానన్న భయంతో వాళ్ళ ఇళ్ళకి మాత్రం వెళ్ళదు.

గోపీని దగ్గర కూర్చోబెట్టుకుని అమెరికా కబుర్లు చెప్పించుకుంది. అంతా విన్నాక చిన్నగా నిట్టూర్చి చెప్పింది.

"అమెరికాలో మన బంధువులెవరు లేరు. ఉంటే, వెళ్ళి నాలుగు రోజులుండి అన్నీ చూసి వచ్చేదాన్ని. మేం అమెరికా వెళుతున్నాం అంటే మేం అమెరికా వెళుతున్నాం అని అంతా అంటున్నారు. కానీ మన సన్నాసుల్లో ఒక్కడూ అమెరికా వెళ్ళినవాడు లేడు."

ఆవిడలోని ప్రత్యేకత పాటలు పాడుకుంటూ పనిచేస్తుంటుంది.

ఆ రాత్రి అనసూయ పనిచేస్తూ పాడుకుంటూంటే గోపీనాథ్ ఆ పాట విన్నాడు.

"చింతపండు నానిందా లేదా? చారులో ఉప్పు వేయాలి. వీళ్ళింట్లో బెల్లానికి కరువు.."

ఆ పాట నిండా అన్నీ అలాంటి మాటలే.

"ఏమిటత్తా నువ్వు పాడేపాట, ఉప్పూ చింతపండు అంటూ?" అడిగాడు గోపీనాథ్ నవ్వుతూ.

"విన్నావా నాయనా నువ్వు?"

"అవును. నువ్వే కట్టావా ఈ పాట?"

"చూడు నాయనా, నేను పాట పాడుతూ పనిచేసుకుంటే, జాలీగా పని చేస్తున్నాననుకుంటారు. అదే నాలో నేను మాట్లాడుకుంటూ పనిచేస్తూంటే పిచ్చెక్కిందని ఇంటికి రానీరు. అందుకని ఈ ట్రిక్ కనిపెట్టాను నాయనా" చెప్పిందావిడ నవ్వుతూ.

గోపీనాథ్ ఇ - మెయిల్ బూత్‌కి వెళ్ళి యు.ఎస్.ఏ. డాట్ నెట్‌లోని తన ఇ - మెయిల్ అకౌంట్ ఓపెన్ చేసి చూశాడు. నాలుగు మెయిల్స్‌వున్నాయి. ఒకటి అమెరికాలోని రెడ్డినించి, ఇండియాకి గోపీనాథ్‌ని డిపోర్ట్ చేసారని తెలిసి ఆ మెయిల్ యిచ్చాడు, వెంటనే జవాబు ఇవ్వమని. తను క్షేమంగా ఇండియా చేరుకున్నట్లుగా జవాబిచ్చాడు గోపీనాథ్.

మరొకటి సెండర్‌లో క్రియేటివ్ చూడగానే అది సునీత నుంచి అని గ్రహించాడు. క్లిక్ చేసి దాన్ని ఓపెన్ చేసి చదివాడు.

'నువ్వు ఇండియా వెళ్ళావని ఇచ్చిన మెయిల్ చూసి సంతోషపడ్డాను, బాధపడ్డాను. సంతోషం దేనికంటే, నువ్వు ఇండియాలో ఉన్నందుకు. బాధ ఎందుకంటే ఇంక నువ్వు ఎప్పటికీ అమెరికా రాలేకపోవచ్చన్నందుకు. నీకింక ఏ రకం వీసా కూడా దొరకదు అని.'

మిగతా రెండూ అతను సబ్‌స్క్రయిబ్ చేసిన ఎలక్ట్రానిక్ మేగజైన్స్ నించి. సునీతకి జవాబు టైప్ చేశాడు.

***డియర్ సునీత,***

ఇండియా వచ్చాక నాకోటి స్పష్టంగా అర్థమైంది. అమెరికాకి, ఇండియాకి గల తేడాలని అక్కడికంటే యిక్కడే బావుంది నాకు.

అమెరికాలో మీకక్కడ ఎత్తయిన బిల్డింగ్స్ వుంటాయి. కానీ నీతి నియమాలు పొట్టివి. విశాలమైన రోడ్లుంటాయి. కాని స్వభావాలు ఇరుకైనవి.

ఖర్చు ఎక్కువ చేస్తారు కానీ వుండే డబ్బు తక్కువ. తక్కువగా నవ్వుతారు. వేగంగా డ్రైవ్ చేస్తారు. తక్కువ టైంలో తయారవుతారు. ఎక్కువ టైం టివిని చూస్తారు.

విలువైన వస్తువులు ఎక్కువ కాని మానవత్వపు విలువలు తక్కువ. మీకక్కడ ఎలా బతకాలో తెలుసుకాని ఎలా జీవించాలో తెలీదు. చంద్రుడి మీదకి వెళ్ళొస్తారు. కానీ వీధి దాటి ఎదురింటి మిత్రుడిని కలుసుకోడానికి వెళ్ళరు.

ఆటంని లొంగదీసుకున్నారు. కానీ గర్వాన్ని అలాగే వదిలేసారు. ఎక్కువ ఆదాయం వున్న మీకు తక్కువ మోరల్స్ వున్నాయి. నాలుగేళ్ళు అక్కడ వుండి తిరిగి వచ్చాక నాకివన్నీ అర్థమౌతున్నాయి. నేనిక తిరిగి ఎన్నడూ అమెరికాలో కాలుపెట్టదలచుకోలేదు. నన్ను వెనక్కి పంపించగలిగారు కానీ ఇండియానించి ఎంతోమందిని ఆ కసితో అమెరికాకి తోసేస్తాను. అదీ వాళ్ళెవర్నీ నాలా కనుక్కుని వెనక్కి

పంపలేని విధంగా. అమెరికా ఇమ్మిగ్రేషన్ లా లోని అడ్డదారుల్లో చాలామందిని అక్కడికి పంపుతుంటాను. ఓ విధంగా ఇక మీదట నాకిదో టైంపాస్.

సారీ, మూడ్ బాగోలేదు. అయినా టైప్ చేసేసాను. కాబట్టి డిలీట్ చేయడంలేదు. అఫెండ్ అవవుకదా?

మీ పిల్లలిద్దరు ఎలా వున్నారు? బాబూష్‌ని ప్రత్యేకంగా అడిగానని చెప్పు. త్వరలో మా తమ్ముడు అక్కడికి వస్తున్నాడు. నాకు ఆశ్రయం ఇచ్చినట్లుగా వాడికి ఇస్తావు కదూ? ఇ - మెయిల్ ద్వారా టచ్‌లో వుండు.

***ఎల్.వి.గోపి***

Post your comments

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**